క్లుప్తంగా

24న ఈఎంఆర్ఎస్‌ల్లో రెండో విడత కౌన్సెలింగ్

సీతంపేట: భామిని, మెళియాపుట్టిలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ ఈ నెల 24న నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈపీ గ్రూపుల్లో 26, మెళియాపుట్టిలో 30 సీట్లు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. కొత్తూరులో ఉన్న ఏకలవ్య స్కూల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

పీజీహెచ్ఎం పోస్టులు భర్తీ చేయాలి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న పీజీ హెడ్‌మాస్టర్ పోస్టులు భర్తీ చేయాలని డీటీఎఫ్ నాయకులు కోత ధర్మారావు, చింతాడ రఘురాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓంధ్రుజోల, మెళియాపుట్టి, పెద్దమడి, బుడంబో, చిన్నకోస్తా ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు గిరిజన సంక్షేమ శాఖలో ఉన్నారన్నారు. ప్రమోషన్‌లు ఇవ్వకపోవడంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జూన్ 2023లో జిల్లా పరిషత్, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న హైస్కూల్‌లో పీజీ హెడ్‌మాస్టర్ పోస్టులకు పదోన్నతులు ఇచ్చారన్నారు. ఇక్కడ ప్రమోషన్లు ఇవ్వకపోవడమేమిటని ప్రశ్నించారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్షలు

పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. శుక్రవారం చేపట్టిన దీక్షల్లో పి.భాస్కరరావు, పి వేణు, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు సముచిత స్థానం కల్పించాలి

వీరఘట్టం: వీరఘట్టం రహదారి విస్తరణలో భాగంగా ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబద్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఇటీవల తొలగించారు. ఈ విగ్రహాలకు సముచిత స్థానం కల్పించి అందరి సమ్మతితో ముఖ్యమైన కూడళ్లలో పునః ప్రతిష్ఠ చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో జైభీమ్ సంఘం నాయకులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణ వల్ల రెండు విగ్రహాలు ఒకే కూడలిలో అమర్చడం వీలుకాదని, అందుచే సంఘ సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని విగ్రహాలను అమర్చాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులు చకచకా జరుగుతున్నాయని, అయితే భూగర్భంలో ఉన్న తాగునీటి పైపులైన్ పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డు పనులకు ఆటంకంగా ఉందని, వెంటనే తాగునీటి పైపులైను పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డిల్లేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈ గౌరీశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జైభీమ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన అవసరం

పాలకొండ రూరల్: వర్షాల కారణంగా సమగ్ర సర్వే ప్రక్రియలో ఏర్పడుతున్న సమస్యలను అధిగమించేందుకు సమయపాలన అవసరమని డిప్యూటీ తహసీల్దార్ బొమ్మలాట బుచ్చయ్య అన్నారు. వీరఘట్టం రహదారిలో సర్వే నంబర్ 197 నుంచి 201, 265 – 267, 269 మధ్య గల తోటల్లో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో అక్కడి రైతులు, భు హక్కుదారుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సర్వే క్రమంలో సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భూముల సర్వేలో రికార్డుల ప్రాప్తికి విస్తీర్ణం క్షుణ్ణంగా నమోదు చేసేందుకు రోవర్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. శనివారం కూడా ఇదే సర్వే నంబర్లలో ఉదయం 7 గంటలకు తమ బృందాలు సర్వే చేపడతాయన్నారు. మండల సర్వేయర్లు పి.వెంకటరమణ, జి.గణేష్, వీఆర్వోలు రామారావు, బి.సాయిశ్రీనివాస్ తదితరులున్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం

భామిని: మండలంలోని నేరడి–బీ ఎంపీయూపీ స్కూల్‌లో బదిలీపై వెళ్లిన ముగ్గురు టీచర్లను శుక్రవారం సన్మానించారు. ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని దుశ్శాలువలు కప్పి అభినందించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏల దీక్షలు

జియ్యమ్మవలస: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు రెండో రోజు దీక్షలు కొనసాగించారు. వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు దిలీప్‌కుమార్ మాట్లాడుతూ వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలని కోరారు. దీక్షల్లో మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

పాలకొండ: సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో ఎస్.గోపి, బిజరామయ్య, ఆర్.ప్రసాద్, డి.పారమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరుతోందిలా...

- భీంపురం వద్ద వంతెన నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- 120 గిరిజన గ్రామాల ప్రజలకు అందనున్న సేవలు
- నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

120 గిరిజన గ్రామాల ప్రజల దశాబ్దాల కల... గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ గిరిజనం కష్టాలను గుర్తించింది. సమస్యను పరిష్కరించాలని నిర్ణయించింది. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కృషితో ఆయా గ్రామాలకు అవసరమైన వారధి నిర్మాణానికి రూ.80లక్షలు మంజూరు చేసింది. తాజాగా వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మరో ఆరు నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. దీంతో వారి రహదారి కష్టాలు తీరనున్నాయి. వారి దశాబ్దాల కల నెరవేరనుంది. వివరాల్లోకి వెళ్తే...


వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని ఒబ్బంగి పంచాయతీ భీంపురం గిరిజన గ్రామ సమీపంలో వంతెన లేక 120 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలకు దశాబ్దాలుగా అవస్థలు పడుతున్నారు. విద్య, వైద్యం కోసమైతే వారు పడే అవస్థలు చెప్పనలవి కానివి. అయినా గతంలో ఏ పాలకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందక పలువురు గిరిజనులు మృత్యువాత పడ్డారు. డోలీలో తరలిస్తుండగానే వారిని మృత్యువు వెంటాడేది. మరో వైపు గిరిజన ఉత్పత్తులు తరలించే పరిస్థితి లేక తీవ్రంగా నష్టపోయేవారు. చదువుకోవాలన్న గిరిజన చిన్నారులు పాఠశాలలకు వెళ్లే మార్గం లేక మధ్యలోనే చదువులు ఆపేసేవారు. ఈ పరిస్థితుల్లో గత పాలకులకు, అధికారులకు భీంపురం వద్ద వంతెన నిర్మించాలని గిరిజనులు ఎన్నోసార్లు విన్నవించారు. అయినా ఫలితం లేకపోయింది. ఇదిగో.. అదిగో.. అన్నారే తప్ప చేసింది లేదు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా వంతెనలు, రహదారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇదే సమయంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి వంతెన లేకపోవడంతో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు రూ.80 లక్షలను మంజూరు చేసింది. వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తలంచి శంకుస్థాపన చేశారు. పనులు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. అనుకున్న సమయంలో పనులు పూర్తయితే విద్య, వైద్యం, గిరిజన ఉత్పత్తుల తరలింపు తదితర సౌకర్యాలు ఆయా గిరిజన గ్రామాలకు అందుబాటులోకి రానున్నాయి. దశాబ్దాలుగా గిరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలు తీరనున్నాయి.

120 గ్రామాల గిరిజనుల కల

భీంపురం వద్ద వంతెన నిర్మాణం పూర్తయితే పార్వతీపురం – సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 120 గిరిజన గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. నీలకంఠాపురం, వాడకొయ్యి, సుక్కుగూడ, జరడ, గాణలి, తిత్తిరి, గురండి, ఈతమానుగూడ, సీడుమానుగూడ, బంజరుగూడ, షరాబుగూడ, పుట్టిగాడిగూడ, కోమటిగూడ, నెల్లిగూడ, సావిసివలస, చినబగ్గ తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఇక ఉత్పత్తుల తరలింపు సులభం


ఇక తాము పండించే అటవీ ఉత్పత్తుల తరలింపు సులభతరమవుతుంది. గతంలో వంతెన లేక ఉత్పత్తుల తరలింపునకు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇకపై ఆ పరిస్థితి ఉండదు. మా కష్టాలు తీరనున్నాయి. – ఊయక పుల్లంగి, భీంపురం

ఆరు నెలల్లో పూర్తి చేస్తాం...


భీంపురం వద్ద వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తయితే పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సుమారు 120 గిరిజన గ్రామాల ప్రజలకు కష్టాలు తీరుతాయి. ఉపయోగకరంగా ఉంటుంది. – ఎస్.అప్పారావు, ఏఈ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం

కల నిజం చేస్తున్నాం..


గిరిజనుల దశాబ్దాల కల నిజం చేస్తున్నాం. 2014లోనే సమస్య విన్నాను. అప్పుడు ప్రతిపక్షంలో ఉండి ఏం చేయలేని నిస్సహాయ పరిస్థితి. గత ప్రభుత్వాలు గిరిజన అభివృద్ధిని పక్కన పెట్టాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో ఈ వంతెనకు రూ.80లక్షలు మంజు చేసింది. పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపడతా... గిరిజన కష్టాలు తీర్చుతా... – పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే

వైద్య సేవలు అందుతాయి..


వంతెన నిర్మాణం పూర్తయితే అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందుతాయి. మా కష్టాలు తీరుతాయి. గతంలో వంతెన లేక మా గ్రామంలోనే పలువురు మృత్యువాడ పడ్డారు. ఇక ఆ కష్టాలు తీరుతాయి. – తాడంగి గంగమ్మ, భీంపురం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం


దశాబ్దాలుగా తీరని వంతెన సమస్యపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించింది. నిర్మాణానికి చర్యలు చేపట్టడం సంతోషం. గత పాలకులు మా కష్టాలు పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – పి.మార్కో, ఈతమానుగూడ

వలంటీర్లను చూస్తే వారికి వణుకు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: వలంటీరు అనే పదం వింటే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు నేరుగా ప్రజలకు అందజేస్తున్నారని అన్నారు. దళారీ వ్యవస్థకు తావులేకుండా ప్రభుత్వం చేపడుతున్న పారదర్శక పాలనలో వలంటీర్లు కీలకంగా మారడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు అపార నమ్మకం ఏర్పడిందన్నారు. దీంతో వలంటీర్లను మానసికంగా దెబ్బకొట్టేందుకు జనసేన, టీడీపీ కలిపి కుట్ర పన్నుతూ తప్పుడు ఆరోపణలు చేస్తూ మానసికంగా దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలో వలంటర్లు చేసిన సేవలను దేశమంతా మెచ్చుకుంటుంటే పవన్‌కళ్యాణ్‌కు మాత్రం వలంటీర్లు సేవలు కనిపించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ఎంపీపీ వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన


ఓటరు జాబితాపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావివలస, రావుపల్లి తదితర గ్రామాలలో ఓటరు జాబితాలను బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి శుక్రవారం పరిశీలించారు. జూలై 21 నుండి ఆగస్టు 21వరకు బూత్‌స్థాయి అధికారులతో ఇంటింట ఓటరు వివరాల విచారణ చేపట్టనున్నారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఫారం – 6ద్వారా ఓటరును నమోదు చేయాలి. ఫారం – 7 ద్వారా వలసలు వెళ్లిన వారిని, మరణించిన వారిని కుటుంబ సభ్యులకు నోటీసులను ఇచ్చి తొలగించాలి. ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 29 వరకు ఓటరు కార్డుపై ఫొటో మిస్ మ్యాచింగ్, క్లారిటీ లేకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర అంశాలను పరిశీలించడం జరుగుతుంది. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 16 వరకు ముసాయిదా జాబితా ప్రచురించడం జరుగుతుంది. అక్టోబర్ 17 నుండి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించవచ్చు. తుది ఓటరు జాబితా జనవరి 5న ప్రచురించడం జరుగుతుంది. కార్యక్రమంలో ఈవోపీఆర్డి ఎల్.గోపాలరావు, బీఎల్ఓలు తదితరులున్నారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: ఓటర్లు ఓటు సవరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.చైతన్యప్రవంతి, వీఆర్వో (బీఎల్వో) అమరావతి అన్నారు. ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం 1లో పలువురు ఓటర్లకు ఓటు సవరణలపై ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

నాలుగేళ్లలో సంక్షేమ విప్లవం

- ఎమ్మెల్యే కళావతి


అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చారని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పులిపుట్టి గ్రామ సచివాలయం పరిధిలో జోరువానలో పులిపుట్టి, సుందరయ్యగూడ, ఆర్ఆర్ కాలనీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. తామంతా శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలానికి చెందిన నిర్వాసితులమని ఇక్కడ మాకు కాలనీ ఇచ్చారని, అక్కడ రేషన్‌కార్డులు ఉండడంతో గృహనిర్మాణాలు కట్టుకుందామన్నా ఇబ్బందులు పడుతున్నామని ఆర్ఆర్ కాలనీ వాసులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే మహిళా సంఘాలకు కూడా ఇక్కడ సభ్యత్వం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సంక్షేమ పథకాలు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుండడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఒకవైపు జోరు వాన కురుస్తున్నా...ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు వెంకటేష్, కృష్ణ, రామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వర్షం


పొలాల్లో పుష్కలంగా చేరిన వర్షపు నీరు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. ముఖ్యంగా పొలాల్లో పుష్కలంగా వర్షపు నీరు చేరింది. వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం కాస్త తెరిపిస్తూనే మరలా కురుస్తూ సాయంత్రం వరకూ కొనసాగింది. దీంతో ఆయా పనుల నిమిత్తం బయటికెళ్లే వారు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

ఎరువుల పంపిణీ

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామంలో రైతులకు రాయితీ ఎరువులను సర్పంచ్ కనుముల సంధ్యారాణి శుక్రవారం పంపిణీ చేశారు. 230 బస్తాల డీఏపీని రైతుల అవసరాల మేరకు పంపిణీ చేపట్టారు. త్వరలోనే యూరియా కూడా అందిస్తామన్నారు. ప్రస్తుతం వర్షాలకు కురుస్తున్న క్రమంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని పొలంబాట పట్టాలన్నారు. వ్యవసాయ సహాయకురాలు మేరీ జోన్స్ మాట్లాడుతూ వర్షాల కారణంగా పొలంలో చేరిన నీటిని వీలైనంత త్వరగా బయటకు వెళ్లేలా దారులు ఏర్పాటు చేయాలన్నారు. నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాలిబాటల ఆవశ్యకతలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఎం.మన్మధరావు, కె.దాము సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యం రవాణా చార్జీలపై విచారణ జరపాలి

పాలకొండ: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు అమ్మిన ధాన్యం రవాణా చార్జీలలో అవకతవకలు జరిగాయని ఏపీ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ధాన్యం తరలించుకుంటే రవాణా చార్జీలు చెల్లించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి రవాణా చార్జీలు విడుదలైనా.. రైతులకు మాత్రం అందలేదని తెలిపారు. మిల్లర్లతో కొంతమంది అధికారులు కుమ్మక్కు కావడంతో రవాణా చార్జీలు పక్కదారి పట్టించి స్వాహా చేశారని ఆరోపిచాంచారు. దీనిపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ చేయాలని కోరారు. ఆయనతో పాటు పలువురు రైతులు ఉన్నారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి

భామిని: పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు సూచించారు. మండలంలోని నేరడి బీ, గురండి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించి పలు సూచనలు చేశారు. అప్పటికే వండిన వంటలను రుచి చూశారు. వంట ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. వారి వెంట హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దళిత కళాకారులను ఆదుకోవాలి



ప్రదర్శన చేస్తున్న డప్పు కళాకారులు

భామిని: డప్పు వాయిద్యాలతో జీవిస్తున్న దళిత కుటుంబాలకు ప్రభుత్వం మూడు ఎకరాల సాగు భూమి ఇచ్చి ఆదుకోవాలని దళిత డప్పు కళాకారుల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మల సంజీవ్, డి.గణేష్ శుక్రవారం డిమాండ్ చేశారు. భామిని మండల కేంద్రంలో డప్పుకళాకారులతో ప్రదర్శన నిర్వహించి సమస్యలపై విన్నవించారు. జూలై 25, 26 తేదీలలో పాతపట్నంలో జరగనున్న అధ్యయన తరగతులు జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. మండల డప్పు కళాకారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

గరుగుబిల్లి: చిరుధాన్యాలు ఆరోగ్యానికి మహాభాగ్యమని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో జట్టు ట్రస్టీ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన రైతులకు చిరుధాన్యాల సాగులో మెలకువలు, విత్తన ఎంపికపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొక్యూర్మెంట్ ప్రాసెసింగ్, రిటైలింగ్ కోఆపరేటివ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సలహాదారు ముఖేష్ దవే మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలు చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించడం జరిగిందన్నారు. 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలలో క్యూనోవ రకానికి చెందిన చిరుధాన్యం తొమ్మిది రకాల పోషకాలు కలిగి వున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. జట్టు ప్రాంగణంలో క్వినావో రకం సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు డైరెక్టర్ ప్రహరాజ్, నూకంనాయుడు, అన్నపూర్ణ తదితరులున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించి ఆదివాసీలను రక్షిద్దాం

కురుపాం: పర్యావరణాన్ని పరిరక్షించి ఆదివాసీలను రక్షిద్దాం అనే నినాదంతో ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలకు సిద్ధమవుతున్నట్టు ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబురావు వెల్లడించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తరతరాల నుంచి గిరిజనులు పోడునే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, దీని వల్ల పర్యావరణానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు, సీదర అప్పారావు, మండంగి రమణ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి


చిదిమి - పాలమెట్ట రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. రూ.1.40 కోట్లతో నిర్మించనున్న చిదిమి – పాలమెట్ట రహదారికి శుక్రవారం శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు విషయమై గతంలో పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి రోడ్డుకు రూ.1.40 కోట్లు మంజూరు చేసిందన్నారు. అలాగే వీరఘట్టం మేజరు పంచాయతీలో నాలుగు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల్లో భాగంగా పలు సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు లెంకవీధి వద్ద అభివృద్ధి పనులకు వీరు భూమి పూజ చేశారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌కు సూచించారు. ప్రజా సంక్షేమం నిరంతరం పాటు పడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్‌లు పులిటి గౌరమ్మ, దమలపాటి ఉమామహేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈ గౌరీశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు


ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు మండల విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈమేరకు మండలంలోని కొత్తూరు క్లస్టర్ పరిధిలో గొట్టివలస, శివ్వాం, కొత్తూరు పాఠశాలల పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు సీఆర్‌పీ రామకృష్ణ, ఐఈఆర్‌పీ వీర్రాజులు ఇంటింటి సర్వేను శుక్రవారం నిర్వహించారు. గుర్తించిన పిల్లలను ప్రశస్త యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 28వరకు గ్రామాలలో ప్రత్యేకంగా సర్వేను నిర్వహించి గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు అడ్డు పడుతున్నారు...

- సబ్ కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన ఎమ్మెల్సీ


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: పట్టణ ప్రజలను వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మార్గం చూపించినా ఈ అభివృద్ధి పనులను కొందరు వారి స్వప్రయోజనాల కోసం అడ్డుపడుతూ సమస్యలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌కు వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ విక్రాంత్ నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుతో కలిసి సబ్ కలెక్టర్‌ను శుక్రవారం కలిశారు. సమస్యను వివరించారు. పారాపురం వద్ద ప్రభుత్వం డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించిందని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామన్నారు. అయితే కొందరు ఈ పనులను అడ్డుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ పనులకు అడ్డు పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పనులు జరుగుతున్న చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ జీవీ కృష్ణారావుకు సూచించారు. పట్టణంలో వడమ వద్ద కల్యాణి కోనేరు, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని వెంకటరాయుని కోనేరు వద్ద చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కమిషనర్ పలు విషయాలను సబ్ కలెక్టర్‌కు వివరించారు.

రేషన్ డీలర్ల మహాసభ రేపు

జియ్యమ్మవలస: రాష్ట్రంలోని రేషన్ డీలర్ల మహాసభ ఈ నెల 23న విజయవాడలోని బసవ పున్నయ్య స్టేడియంలో జరగనుందని సభకు డీలర్లంతా హాజరు కావాలని మన్యం జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మోనంగి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. డీలర్లకు రావాల్సిన ఐసీడీఎస్, ఎండీఎం కమిషన్ ఇంత వరకు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విడుదల చేయాలని కోరారు.